నిమ్స్‌మే ప్రాంగణంలోకి దుండగులొచ్చారు

● మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు

యూసు‌ఫ్‌గూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌మే సంస్థ ప్రాంగణంలోకి అర్ధరాత్రి మారణాయుధాలతో దుండగులు ప్రవేశించారని ఆ సంస్థ సూపరింటెండెంట్ జె.బిక్షపతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న అర్ధరాత్రి 2గంటలకు పోలీస్ బెటాలియన్ సమీపంలోని నిమ్స్‌మే ప్రహరీ దాటి కొందరు దుండగులు నిమ్స్‌మే ప్రాంగణంలోకి ప్రవేశించారు. సెక్యూరిటీ సిబ్బంది టార్చ్‌లైట్ వేసి చూడగా వారి వద్ద పెద్ద కత్తులు, ప్రమాదకరమైన ఆయుధాలు కనిపించాయి. అనంతరం వారు అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీస్ పెట్రోలింగ్ పెంచి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్యాబ్‌లో మొబైల్ ఫోన్ చోరీ

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): క్యాబ్‌లో ఉన్న సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బహదూర్‌పురాకు చెందిన హనీఫ్ క్యాబ్ డ్రైవర్. ఈ నెల 19న తన కారులో బంజారాహిల్స్ రోడ్డు నం-1 హయత్ ప్యాలెస్ సమీపంలోకి వచ్చాడు. కస్టమర్లు దిగాక మరో రైడ్ కోసం అక్కడే ఉండి కొద్దిసేపు నిద్రపోయాడు. లేచి చూసుకునేసరికి కారు డెక్ మీద ఉన్న రెడ్‌మీ సెల్‌ఫోన్ కనిపించలేదు. ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. హనీఫ్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి... నిర్మాణదారుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): వాహనాలకు అడ్డంకులు సృష్టించేలా భవన నిర్మాణ సామగ్రిని రోడ్డు మీద పెట్టిన నిర్మాణదారుడిపై కేసు నమోదు అయింది. షేక్‌పేట నాలా వద్ద ఓ భవన నిర్మాణదారుడు ఇసుక, కంకర, ఇనుప చువ్వలను రోడ్డు మీద పెట్టాడు. దీని వల్ల ట్రాఫిక్ ఆటంకాలు కలుగుతుండటంతో టోలిచౌకికి చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ హెచ్చరించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కానిస్టేబుల్ ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కామారెడ్డికి చెందిన బరాది రూపేందర్‌రెడ్డిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పగలు డ్రైవింగ్... చీకటి పడగానే చోరీలు

● మానసిక వైద్యుడి ఇంట్లో చోరీ చేసిన నిందితుడి అరెస్ట్


నిందితుడు శివకుమార్

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): పగలు డ్రైవింగ్ చేస్తూ.. చీకటి పడగానే చోరీలు చేస్తున్న పాతనేరస్థుడిని పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 52లోని అపోలో ఆస్పత్రి మానసిక వైద్యుడు అశోక్‌కుమార్ అలిమ్‌చందని ఇంట్లో దొంగలు పడి రూ.25 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. వైద్యుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా నారాయణపేటకు చెందిన సాకలి శివకుమార్ అలియాస్ శంకర్ అని తేలింది. శివకుమార్ బోరబండ సమీపంలోని అల్లాపూర్‌లో నివాసముంటున్నాడు. ఇటీవలే ఓ కారు కొనుగోలు చేసి దాన్ని ఓ చానెల్‌లో ఏప్రిల్ 24 నుంచి మే 8 వరకు అద్దెకు పెట్టాడు. ఈ కారుకు తానే డ్రైవర్‌గా వ్యవహరించాడు. కారు నడుపుతున్న సమయంలోనే తాళాలు ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలోనే వైద్యుడి ఇంటి వద్ద కూడా రెక్కీ నిర్వహించాడు. ఈ నెల 17న రాత్రివేళ ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం భవనం వెనుక భాగం ప్రహరీ దూకి మొదటి అంతస్తుకు చేరుకున్నాడు. తనతో తెచ్చుకున్న సుత్తి, కటింగ్ ప్లేయర్‌తో బెడ్‌రూం తలుపు తెరిచి చోరీ చేశాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి రూ.23.70 లక్షల నగదు, నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో మాదాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడని పోలీసులు తెలిపారు.

భార్య తనతో ఉండటం లేదని భర్త ఆత్మహత్య

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): భార్య తనతో ఉండడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 14కు చెందిన మణికంఠ 2018లో తుమ్మ సాయి మౌనికను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. పిల్లలు లేరు. కొద్ది రోజులకు మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. ఈ నెల 19న ఇబ్రహీంపట్నంలో ఉంటున్న మౌనిక వద్దకు మణికంఠ వెళ్లి తనతో కాపురానికి రావాలని అడిగాడు. ఆమె నిరాకరించడంతో భవనం మూడో అంతస్తులో నుంచి దూకడంతో మరో భవనంపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మౌనిక ద్వారా విషయం తెలుసుకున్న మణికంఠ తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి మృతి

బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పుర రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం 6.35 గంటల సమయంలో సుమారు 30 ఏళ్ల వయస్సుగల యువకుడు రైలు కిందపడడంతో శరీరం రెండు ముక్కలయింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో గుండెపోటుతో ప్రయాణికుడు..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. శ్రీకాకులం జిల్లాకు చెందిన జగ్గారామ్(45) సికింద్రాబాద్ వైపు గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగిలో ప్రయాణం చేస్తుండగా గుండెపోటుతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రాగానే జగ్గారామ్ చనిపోయినట్లు తోటి ప్రయాణికులు జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


సంపత్‌కుమార్

కవాడిగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట్ సీసీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌరి సంపత్‌కుమార్(33), ఉమాదేవి దంపతులు నివసిస్తున్నారు. ఈనెల 18న పనికి వెల్లకుండా సంపత్‌కుమార్ పిల్లలతో ఇంట్లోనే ఉన్నాడు. భార్య ఉమాదేవి పనికి వెళ్లి రాత్రి 7గంటలకు ఇంటికి రాగా అతడు కనిపించలేదు. సంపత్‌కుమార్ ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విద్యుత్ తీగలపై పడిన చెట్లు తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్‌తీగలపై కూలిన భారీ వృక్షాలు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు కేపీహెచ్‌బీ 4, 5, 6, 9వ ఫేజ్‌లో భారీ వృక్షాలు విద్యుత్‌తీగలపై పడటంతో తెగిపడ్డాయి. 33 కేవీ విద్యుత్‌లైన్‌పై ప్లాస్టిక్ షీట్ పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. భారీ చెట్లు తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా రెండు గంటలకు పైగా నిలిచిపోయింది. డీఆర్‌ఎఫ్ టీం సభ్యులతో విద్యుత్‌శాఖ సిబ్బంది విరిగిన చెట్లను తొలగించారు. రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్, సైబర్ సిటీ ఎస్‌ఈ వెంకన్నలతో పాటు డీఈ, ఆపరేషన్ వింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 4 విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో 33 కేవీ లైన్, వసంత్‌నగర్, డీమార్ట్ సమీపంలో 11 కేవీ విద్యుత్‌లైన్లు తెగిపోయినట్లు రంగారెడ్డి సీజీఎం ఆనంద్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ బృందాలు చెట్లు తొలగించిన అనంతరం యుద్ధప్రాతిపదిన విద్యుత్ లైన్లు పునరుద్ధరించి విద్యుత్ సరఫరా అందించినట్లు తెలిపారు. ఈదురుగాలులు, వర్షాలకు విద్యుత్‌తీగలు తెగిపడితే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, తెగిపోయిన తీగలు ఎవరూ ముట్టుకోవద్దని సూచించారు. 24 గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ న.1912తో పాటూ స్థానిక అధికారులను ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

జోరుగా.. హుషారుగా.. స్కేటింగ్ చేద్దాం

● స్కేటింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు ● కాలనీలు, బస్తీల్లో శిక్షణ ఇస్తున్న నిరుద్యోగ యువకులు

చల్ చల్ చెలో అంటూ కాళ్లకు చక్రాలు కట్టుకొని అడుగులు వేసే బుడతడి నుంచి 'పరుగు' తీసే యువకుడి వరకు హుషారు చూపిస్తున్నారు. వేసవి వచ్చిందంటే చాలు పిల్లల, విద్యార్థులు, యువకులు స్కేటింగ్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.


జూబ్లీహిల్స్‌లో స్కేటింగ్ చేస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలో వేసవిశిబిరాల జోరు కొనసాగుతోంది. పుస్తకాలతో కుస్తీ పట్టే పిల్లలకు కాస్తా ఆటవిడుపు వచ్చింది. ఎప్పుడూ చదువు అంటూ వెంటపడే తల్లిదండ్రులు స్వేచ్ఛగా ఆటల వైపు ప్రోత్సహిస్తున్నారు. పిల్లలు ఆనందంతో పాటూ ఆరోగ్యాన్నిచ్చే ఆటలను ఎంచుకుంటున్నారు. ఇందులో భాగంగా వారి అడుగులు స్కేటింగ్ వైపు దూసుకెళ్తున్నాయి.

నాలుగేళ్ల చిన్నారుల మొదలు ఎనిమిదేళ్లు దాటిన పిల్లల వరకు హాయిగా స్కేటింగ్ చేస్తున్నారు. సరికొత్త ఉత్సాహాన్ని పొందుతున్నారు. గతంలో పోలిస్తే ఇప్పుడు స్కేటింగ్ చేస్తున్న వారి సంఖ్య పదింతలు పెరిగింది. ఇది కేవలం ఆటవిడుపుగా కాకుండా పోటీల్లో పాల్గొనే వరకూ వచ్చింది. ఇప్పుడు అన్ని స్కూళ్లలోనూ స్కేటింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని స్కేటంగ్ ట్రైనర్ సర్కార్ చెబుతున్నారు. కేవలం ఎల్‌బీ స్టేడియంలో మాత్రమే అందుబాటులో ఉండే స్కేటింగ్ ట్రైనింగ్ ఇప్పుడు దాదాపు అన్ని బస్తీల్లో, కాలనీల్లో శిక్షకులు స్వయంగా వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎక్కడ వేసవి శిబిరం పెట్టినా మంచి స్పందన వస్తుందని ఎల్లారెడ్డిగూడలో కోచింగ్ ఇస్తున ‌బాద్‌షా తెలిపారు. వేసవిలోనే కాకుండా మిగతా రోజుల్లో కూడా స్కేటింగ్ నేర్చుకోవడానికి పిల్లలు ఉత్సాహం చూపిస్తున్నారని ఆయన తెలపారు.

అటు వ్యాయామం.. ఇటు సరదా..

స్కేటింగ్ వల్ల రెండు లాభాలు కలుగుతున్నాయి. రోజు స్కేటింగ్ చేయడం వల్ల అటు వ్యాయామం చేసినట్టు ఉండడంతో పాటు సరదాగా షికారు చేయవచ్చు. నిత్యం గంట పాటు స్కేటింగ్ చేస్తే పూర్తి ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు. స్కేటింగ్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.. మానసిక ఎదుగుదలకు ఇది తోడ్పడుతుంది. చిరు ప్రాయంలో స్కేటింగ్ నేర్పిస్తే చాలా ఉపయోగాలు ఉంటాయి.. కొంచెం ఎదిగిన వారిలో ఎముకులకు దెబ్బలు తగిలే అవకాశాలు ఎక్కువ. చిన్న పిల్లలు ఎన్నిసార్లు కిందపడ్డా వారి దేహానికి ఎముకులకు పెద్ద నష్టం ఉండదు.

చిన్న వయసు నుంచే శిక్షణ..

పిల్లలకు చిన్న వయసు నుంచే శిక్షణ పొందాలి. స్కేటింగ్ చేసే చిన్నారుల్లో ఏకాగ్రత పెరుగుతుంది. గతంలో కన్నా ఇప్పుడు తల్లిదండ్రుల్లో మార్పు వచ్చింది. స్కేటింగ్‌లో రాణించేలా తమ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. జాతీయ. అంతర్జాతీయ స్థాయిలో కూడా స్కేటింగ్‌లో విద్యార్థులు మెరుగ్గా రాణిస్తున్నారు.

\- సత్యనారాయణ, శిక్షకుడు

కాలనీలు, బస్తీల్లో..

ఎత్తు పల్లాలు లేకుండా రోడ్లు కనిపిస్తే చాలు అక్కడ విద్యార్థులు స్కేటింగ్ చేసేస్తున్నారు. నిరుద్యోగ యువకులు వారానికి రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. తక్కువ ఖర్చుతో స్కేటింగ్ నేర్చుకునే అవకాశం ఉండటంతో బస్తీవాసులు కూడా తమ పిల్లలను శిక్షణ నిమిత్తం పంపిస్తున్నారు. మున్సిపల్ గ్రౌండ్స్, ఖాళీ స్థలాల్లో స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. జూబ్లీహిల్స్ మూడు ప్రాంతాల్లో స్కేటింగ్ శిక్షణలు జరుగుతున్నాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలలు కూడా స్కేటింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

ఇలా నేర్చుకోవాలి

స్కేటింగ్ నేర్చుకోవాలని అనుకున్నప్పుడు ముందుగా మంచి శిక్షకుడిని ఎన్నుకోవాలి. స్కేటింగ్ వీల్స్‌ను శిక్షకుడు సూచించిన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలి. కొన్ని రకాలు తక్కువ ధరకు దొరుకుతాయి కానీ, వాటి ద్వారా స్కేటింగ్ నేర్చుకునేందుకు చాలా సమయం పడుతుంది. స్కేటింగ్ ప్యాడ్ ధరించిన అనంతరం మెల్లిగా నడవడం నేర్చుకోవాలి. చిన్న పిల్లలైతే వారితో తప్పని సరిగా తల్లిదండ్రులు ఉండటం మంచిది.

జాగ్రత్తలు అవసరం

స్కేటింగ్ చేసే వారు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. స్కేటింగ్ ప్యాడ్ కాళ్లకు వేసుకునే ముందు తప్పనిసరిగా షూ ధరించాలి. పడిపోయినప్పుడు దెబ్బలు తగలకుండా మోకాలికి, మోచేతికి ప్యాడ్‌లు ధరించడం శ్రేయస్కరం. తలకు హెల్మెట్ పెట్టుకోవడం మరిచిపోవద్దు. నిత్యం స్కేటింగ్ చేసే వారు బలమైన ఆహారం తీసుకోవాలి.

6 నుంచి నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యం శ్రీరంగం

పంజాగుట్ట, మే 20(ఆంధ్రజ్యోతి): 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలకు నగరం వేదిక కానుంది. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో జరిగే ఈ పోటీల్లో 26 రాష్ర్టాల నుంచి 700 మందికి పైగా క్రీడాకారులు, అధికారులు పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.క్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు క్రిష్ణరాజ్ పుత్, చిత్రా షినాయ్, కోశాధికారి ఎస్.కే.జమీల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పోటీలు నిర్వాహిస్తున్నామని, ఈ నెల 25న హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో రాష్ట్ర పురుషులు, మహిళల త్రోబాల్ జట్టును ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అదే రోజు చాంపియన్‌షిప్‌కు సంబంధించిన అధికారిక జెర్సీ లోగోను ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చాంపియన్‌షిప్ పోటీల కమిటీ చైర్మన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వీరగల్లు శిల్పాలను పరిరక్షించాలి: డాక్టర్ చెల్లప్ప


త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ చెల్లప్ప, డాక్టర్ విజయబాబు, వేదకుమార్ తదితరులు

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో వీరగల్లు శిల్పాలను పరిరక్షిస్తున్నట్టుగానే రాష్ట్రంలో కూడా వాటిని పరిరక్షించాలని డాక్టర్ ఎస్.చెల్లప్ప సూచించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ బీవీ భద్రగిరీష్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ రాసిన త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు (గణపతిదేవుని సంభాషణ-రుద్రమకీల్గుంటె) పుస్తకావిష్కరణ జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయబాబు మాట్లాడుతూ త్రిపురాంతకంలో ఎన్నో శిల్పాలు ఉన్నాయని అన్నారు. దేశానికి స్వాతంత్య్రం రాకముందు మన చరిత్రను యూరోపియన్లు వారి దృక్పథంతో రాశారని, వారి గొప్పతనం గురించి అందులో పొందుపర్చారని అన్నారు. తెలంగాణ చరిత్రను మరచిపోయే విధంగా అప్పటి పాలకులు చేశారని అన్నారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ వ్యవస్థాపకుడు వేదకుమార్ మాట్లాడుతూ ప్రపంచాన్ని నడిపిస్తున్న దేశాలకన్నా మన దేశానికి ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. ప్రతి గ్రామం ఒక మ్యూజియమేనని అన్నారు. చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి భావితరాలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వారసత్వ శాఖ మాజీ ఉప సంచాలకుడు సముద్రాల శ్రీరంగాచార్య, కవి, చరిత్రకారుడు తురిమెల్ల శ్రీనివాస్ ప్రసాద్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్లు కట్టా శ్రీనివాస్, మురళీకృష్ణ, ప్రతినిధులు వేణుగోపాల్, ఎం.స్వామి పాల్గొన్నారు.



గాయని ఎస్పీ శైలజను సత్కరిస్తున్న అతిథులు

ప్రముఖ గాయని ఎస్పీ శైలజకు 'చక్రవర్తి జీవనసాఫల్యం' ప్రదానం

రవీంద్రభారతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ ఎస్పీ శైలజకు సంగీత దర్శకుడు కె.చక్రవర్తి జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో సుస్వరవాహిని సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో స్వరాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత, నటుడు మురళీమోహన్ పురస్కారగ్రహీతను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళల్ని, కళాకారుల్ని ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, అమీన్‌పాషా, పెద్ది సురేష్, నాదప్రియ, గాయత్రి నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం శ్రీనివాస్ రచనలు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పురాణపండ శ్రీనివాస్ రచనల్లోని అక్షరాలు ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం అని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో పురాణపండ శ్రీనివాస్ రచించిన ఉగ్రం వీరం గ్రంథావిష్కరణ సభ సోమవారం సాయంత్రం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. నరసింహస్వామి అవతారంలో ఉగ్రరూపం సమాజ శ్రేయస్సు కోసమేనని పురాణపండ వ్యాఖ్యానించారని, సంస్కృత శ్లోకాలతోపాటు తెలుగులో విశ్లేషణ చేశారన్నారు. ఆధ్యాత్మిక సాహిత్యంలో శ్రీనివాస్ బహుగ్రంథకర్త అన్నారు. ఆయన సామాజిక హితం కోసం జీవితకాలం అంతా ఆధ్యాత్మిక సాహితీ సేద్యం చేస్తూ తన సంపదను వెచ్చిస్తున్న మహనీయుడన్నారు. ప్రొఫెసర్ శరత్‌జ్యోత్స్నారాణి మాట్లాడుతూ.. సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి గ్రంథాలు దోహదపడతాయన్నారు. అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

'నిర్వహణ చార్జీలు చెల్లిస్తేనే అపార్ట్‌మెంట్‌లో సేవలు'

పంజాగుట్ట, మే 20(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లో నిర్వహణ చార్జీలు చెల్లించకుండా సదుపాయాలను కల్పించడం సాధ్యం కాదని సిటీ సివిల్ కోర్టు తీర్పునిచ్చిందని పంజాగుట్టలోని సఫైర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రవీందర్ రెడ్డి తెలిపారు. సోమవారం పంజాగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అపార్ట్‌మెంట్‌లో మొత్తం 102 ఫ్లాట్లు ఉండగా 10 ఫ్లాట్ల యజమానులు 7 సంవత్సరాలుగా నిర్వహణ చార్జీలు చెల్లించడం లేదని, వారికి గత మార్చిలో మౌలిక సదుపాయాల సేవలు నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో వారు పంజాగుట్ట పోలీసులను, సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం నిర్వహణ ఛార్జీలు చెల్లించకుండా హక్కులు కోరుతూ కోర్టును ఆశ్రయించిన వారికి మొట్టికాయలు వేసిందని అన్నారు. అదే సమయంలో ఇటీవల అపార్ట్‌మెంట్ హక్కులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేస్తూ నిర్వహణ చార్జీలు చెల్లిస్తేనే హక్కులు ఉంటాయని, అప్పుడే సేవలు అందుతాయని తెలిపిందని వివరించారు. కోర్టు తీర్పుతో ముగ్గురు యజమానులు బకాయిలతో సహా చెల్లించేందుకు స్పందించారని తెలిపారు. కె.రామకృష్ణ, రవీంద్రకుమార్ అగర్వాల్, బి.కృష్ణ మోహన్, బి.సామ్రాజ్యలక్ష్మి, వై.చైతన్య, బి.శ్రీమన్నారాయణ, సంజీవ్ కె.గుప్తా న్యాయస్థానం ఉత్తర్వులను పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. నెల వారీగా నిర్వహణ చార్జీలు చెల్లించే వారికే అపార్ట్‌మెంట్‌లో సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెస్టుజోన్ డీసీపీ విజయ్‌కుమార్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఏర్పడిన తర్వాత సీపీ స్థాయి అధికారి సందర్శించడం ఇదే మొదటిసారి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సీపీ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసులుతో పాటు.. సిబ్బందితో మాట్లాడి స్టేషన్ పనితీరును, కేసుల నమోదు, నేరాల తీవ్రత, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త పోలీస్‌స్టేషన్ కావడంతో అక్కడి మౌలిక సదుపాయాల గురించి, సిబ్బంది ఇబ్బందుల గురించి ఆరా తీశారు. సెక్టార్‌ల వారిగా నమోదవుతున్న నేరాలపై సమీక్షించారు. ఇప్పటి వరకు నమోదైన స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించే విషయమై క్షేత్ర స్థాయి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. సీపీ వెంట డీసీపీ, జూబ్లీహిల్స్ ఏసీపీ వి.వెంకటగిరి ఉన్నారు.


ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి


ఉపేందర్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఉదిత్‌రాజ్

నార్త్ వెస్ట్ ఢిల్లీ ఎన్నికల పరిశీలకులుగా ఉపేందర్‌రెడ్డి

బంజారాహిల్స్, మే 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నార్త్ వెస్ట్ ఢిల్లీ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, బంజారాహిల్స్‌లో నివాసముండే చింతల ఉపేందర్‌రెడ్డిని నియమిస్తూ ఏఐసీసీ జాతీయ అధికారప్రతినిధి, మాజీ ఎంపీ ఉదిత్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఉపేందర్‌రెడ్డికి ఆయన నియామక ప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సౌత్ ఇండియన్ జనాభా కలిగిన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 25న ఎన్నికలు జరగనుండడంతో తనకు అవకాశం దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు

జేఎన్‌టీయూ కాలేజీలకు ప్రిన్సిపాళ్ల నియామకం

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న రెండు ఇంజనీరింగ్ కాలేజీలకు కొత్త ప్రిన్సిపాళ్లను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సిరిసిల్లా జేఎన్‌టీయూ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను హైదరాబాద్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి తీసుకొచ్చారు. జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈసీఈ ప్రొఫెసర్ ప్రభాకర్‌ను అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ తెలిపారు.

25న సైకాలజిస్టులకు శిక్షణ శిబిరం

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): సైకాలజిస్టులు వృత్తినైపుణ్యాలను పెంపొందించేందుకు సైకియాట్రిస్ట్ డా. రవ్వహరి కుమార్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మాకమలాకర్ తెలిపారు. సోమవారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 25న మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ కార్యాలయంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలకు 9390044031 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మే 20(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు 11కేవీ కుందన్‌బాగ్ ఫీడర్ పరిధిలో, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ మెథడిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కేవీ శాంతిశిఖర ఫీడర్ పరిధిలో, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ సుందర్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలో...

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు 11కేవీ జవహర్ నగర్, స్టేట్ హోమ్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు 11కేవీ సవేర, మారుతినగర్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 11కేవీ అక్బర్ పామ్, ఇంజనీర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలో, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 11కేవీ సత్యసాయి కల్యాణ మండపం, కమలాపురి కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



చిక్కాదేవదాస్ ప్రతిభా పురస్కారంతో సామాజిక సేవా కార్యకర్త కల్లేపల్లి రాజు

సామాజిక సేవాకర్త కల్లేపల్లి రాజుకు చిక్కాదేవదాస్ ప్రతిభా పురస్కారం

బౌద్ధనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన సామాజిక సేవాకర్త కల్లేపల్లిరాజుకి డాక్టర్ చిక్కాదేవదాసు ప్రతిభా పురస్కారం-2024 అవార్డు లభించింది. గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి ప్రధానకార్యదర్శిగా ఉన్న రాజు చేనేత వర్గాలవారితో పాటు సామాజిక ప్రజలకు చేసిన సేవను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. ఇటీవల త్యాగరాయ గానసభ కళానిలయంలో సాంస్కృతిక సంస్థ ఓంకార సత్సంగం ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కొలకలూరి ఇనాక్, మాజీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుంకరి సత్యనారాయణలు ముఖ్యఅతిథులుగా పాల్గొని కల్లేపల్లి రాజుకు చిక్కాదేవదాస్ ప్రతిభ పురస్కారంను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిక్కాదేవదాసు, టీఎస్ఆర్‌జేసీ మాజీ ప్రిన్సిపాల్ చందు ఆంజనేయులు, సురేందర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రైలులో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి



మృతిచెందిన జగ్గారాం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైలులో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన జగ్గారామ్(45) సికింద్రాబాద్ వైపు గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగిలో ప్రయాణం చేస్తుండగా గుండెపోటుతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రాగానే జగ్గారామ్ చనిపోయినట్లు తోటి ప్రయాణికులు జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మారేడుపల్లి మే 20 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి వైడబ్ల్యూసీప ప్రాంతంలో బిక్షాటన చేసే 45 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వైడబ్ల్యూసీప ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం వైడబ్ల్యూసీప ప్రాంతంలో 45 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి రోడ్డుపై పడి ఉన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు వారు ధృవీకరించిన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం కోసం మారేడుపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

ప్రయాణికుడికి బ్యాగు అందజేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైలులో పోగొట్టుకున్న బ్యాగును బాధిత ప్రయాణికుడికి సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు అప్పటించారు. సికింద్రాబాద్ రైల్వే ఆర్పీఎఫ్ ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నాగర్‌సూల్ రైలు దిగడంతో తన బ్యాగు కనిపించలేదు. వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ నరసయ్యతోపాటు ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రైలులో గాలించగా బ్యాగు దొరికింది. అందులో లక్ష రూపాయల విలువ చేసే ల్యాప్‌ట్యాప్, ఖరీదైన వస్తువులు ఉన్నట్లు తెలిపారు. వెంటనే బ్యాగును ప్రయాణికుడికి అప్పగించారు.

తప్పిపోయి వచ్చిన బాలుడు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు నెం.1లోని గేటు నెంబరు 1లో ఓ బాలుడు ఒంటరిగా ఉండడంతో ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై సుబ్బారావు, మహిళా కానిస్టేబుల్ వైశాలిలు వెంటనే బాలుడిని చేరదీసి వివరాలు అడిగే ప్రయత్నం చేశారు. ఆఖరికి తల్లిదండ్రులు ఆమూకీ తెలుసుకుని సమాచారం ఇచ్చారు. ఆర్పీఎఫ్ పోలీసులు బాలుడిని ప్రభుత్వ చైల్డ్‌లైన్ సంస్థకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు.

సెల్‌ఫోన్ అందజేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధిత ప్రయాణికుడికి నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు అప్పగించారు. నాంపల్లి రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ సీఐ కల్పన తెలిపిన వివరాల ప్రకారం బోరబండకు చెందిన సుమన్‌బాబు నాంపల్లి రైల్వే స్టేషన్‌లో రూ.20వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను స్టేషన్‌లో పోగొట్టుకోవడంతో వెంటనే బాధితుడు ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే అప్రమత్తమైన రైల్వే రుద్ర టీం మహిళా కానిస్టేబుళ్లు స్టేషన్‌లో గాలించగా ఎట్టకేలకు సెల్‌ఫోన్ ట్రాక్ ద్వారా లభించడంతో బాధితుడికి మొబైల్‌ను అప్పగించారు.



టంగుటూరి ప్రకాశం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న తెలంగాణ బ్రాహ్మణ వృత్తి, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నావర్జుల సూర్యప్రకాశ్

బస్టాండ్ ఒక ఆపేది మరో చోట

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పార్కింగ్‌కు అడ్డాగా ఈఎస్ఐ బస్టాప్



బస్సు ఎక్కటానికి ప్రయాణికుల అవస్థలు

అది అత్యంత రద్దీగల రహదారి. ఈ రహదారి వెంటే ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. మరో వైపు నగరంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గాంధీ ఆస్పత్రి, ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉండటంతో వచ్చే రోగులు, వారి సహాయకులతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు గాంధీ ఆస్పత్రికి ఎదురుగా వున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద బస్టాప్ అక్రమ పార్కింగ్‌లకు నిలయంగా మారడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక అసౌకర్యానికి గురవుతున్నారు.



బస్టాండ్‌లో ఆగివున్న అంబులెన్స్



నోపార్కింగ్‌లో ఆటోల పార్కింగ్

పద్మారావునగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇరుకైన రోడ్డులో బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది నగరశివార్లలోనో లేక గ్రామీణ ప్రాంతాలలోనో అనుకుంటే పొరపాటే. నగరం నడి బొడ్డున గల గాంధీ ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా గల ఈఎస్ఐ బస్టాండు పరిస్థితి. అసలే ఇరుకైన రోడ్డు, మధ్యలో మెట్రోరైలు పిల్లర్ల నిర్మాణాలతో మరింత ఇరుకుగా మారింది. ఈఎస్ఐ బస్టాండు షెల్టర్ ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినప్పటికీ సరైన నిర్వహణ కరువై యాచకులకు స్థావరంగా మారి, అధ్వానంగా తయారై ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు సైతం బస్టాండ్‌కు బదులుగా ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎదురుగా ఎక్కడపడితే అక్కడ బస్సులను ఆపుతున్నారు. ఇరుకైన రోడ్డు, ఫుట్‌పాత్ వ్యాపారాలు, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు, ఇతర వాహనాల పార్కింగ్‌తో ప్రయాణికులు బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక నానా అవస్థలు పడుతున్నారన్నది వాస్తవం. బస్సు వెళ్లిపోతుందన్న ఆతృతతో ఎక్కేక్రమంలో ప్రయాణికులు ప్రమాదం బారినపడే అవకాశం లేకపోలేదు. సంబంధిత అధికారులు బస్ షెల్టర్ పరిసరాలను శుభ్రపరచి, నిర్వహణ బాధ్యతను చేపట్టాలని ఆర్టీసీ అధికారులు సిబ్బందికి తగిన సూచనలు అందించి బస్సులను బస్‌స్టాండ్ వద్ద ఆపేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. దానితో పాటుగా ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై, బస్ షెల్టర్‌లో ఆటోలు ఇతర వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టి, ప్రయాణికులకు బస్టాండును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

బస్సులను బస్టాండ్‌లో ఆపేలా చూడాలి



గాంధీ ఆస్పత్రి ఎదురుగా గల ఈఎస్ఐ ఆస్పత్రి బస్టాండ్ వద్ద బస్సులు బస్టాండ్‌లో కాక ఎక్కడపడితే అక్కడ ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అక్రమ పార్కింగ్‌తో బస్సులు ఎక్కటానికి నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

\- యాదగిరి, హమాల్‌బస్తీ నివాసితుడు

రోడ్డుపై అక్రమ పార్కింగ్‌తో పాట్లు



గాంధీ ఆస్పత్రి వద్ద గల ఈఎస్ఐ కార్యాలయం ఎదురుగా ఆటోలు, ఇతర వాహనాల అక్రమ పార్కింగ్‌తో ప్రయాణికులు బస్సులు ఎక్కటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు చేపట్టి రోడ్డుపై అక్రమ పార్కింగ్‌ను నివారించి, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలి.

\- నర్సింగరావు.డి, బోయగూడ, ఐడీహెచ్ కాలనీ

23 నుంచి ఋషిపీఠం రజతోత్సవ వేడుకలు

చిలకలగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ, ఆర్ష ధర్మవ్యాప్తి, గోసేవ, భారతీయ సంగీత, నృత్య కళాకారులను ప్రోత్సహిస్తు ఏర్పాటు చేసిన ఋషిపీఠం ఆధ్యాత్మిక మాసపత్రిక, ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్ 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఈనెల 23 నుంచి ఆదివారం వరకు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు గావిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి మారేపల్లి సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ విద్యాభవన్, కింగ్‌కోఠి రోడ్, బషీర్‌బాగ్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. దెందుకూరి వెంకటేశ్వర ఘనాపాఠి పౌండరీక యాజులు (గంగావతరణం), డాక్టర్ సత్యప్రియ రమణ, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్. కె.వి.రమణాచారి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, ఋషిపీఠం అధ్యక్ష సంపాదకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ, మాజీ ఐఏఎస్ అధికారి ఎల్.వి. సుబ్రమణ్యం హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

6 నుంచి నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలకు నగరం వేదిక కానుంది. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో జరిగే ఈ పోటీల్లో 26 రాష్ట్రాల నుంచి 700 మందికి పైగా క్రీడాకారులు, అధికారులు పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.క్రిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు క్రిష్ణరాజ్ పుత్, చిత్రా షినాయ్, కోశాధికారి ఎస్‌కే.జమీల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పోటీలు నిర్వాహిస్తున్నామని, ఈనెల 25న హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో రాష్ట్ర పురుషులు, మహిళల త్రోబాల్ జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు చాంపియన్‌షిప్‌కు సంబంధించిన అధికారిక జెర్సీ, లోగోను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చాంపియన్‌షిప్ పోటీల కమిటీ చైర్మన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడలో అన్నదానం

బౌద్ధనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ద్వాదశి నెల పురస్కరించుకుని వాసవీ బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ (వీబీజీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం చిలకలగూడ గాంధీబొమ్మ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వీబీజీఎఫ్ చైర్మన్ ఎం.రాజు, ప్రతినిధులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ద్వాదశికి అన్నదానం చేస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ వీబీజీఎఫ్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్, కోశాధికారి మధుసూదన్, ప్రతినిధులు శ్రీరామరాజు, తిరువీధి ప్రభాకర్, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధనగర్ నాలాలో పేరుకుపోయిన చెత్తచెదారం



గాయని ఎస్పీ శైలజను సత్కరిస్తున్న అతిథులు

ప్రముఖ గాయని ఎస్పీ శైలజకు 'చక్రవర్తి జీవనసాఫల్యం' ప్రదానం

రవీంద్రభారతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ ఎస్పీ శైలజకు సంగీత దర్శకుడు కె.చక్రవర్తి జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో సుస్వరవాహిని సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో స్వరాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత, నటుడు మురళీమోహన్ పురస్కారగ్రహీతను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, అమీన్ పాషా, పెద్ది సురేష్, నాదప్రియ, గాయత్రి నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది.

పూడికతతీత పనుల పట్ల జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం

- ముంపు బారిన పడతామని ప్రజల ఆందోళన

సికింద్రాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో పూడికతీత పనుల విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సికింద్రాబాద్‌లోని పలు బస్తీలు వరద ముంపు బారిన పడే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వర్షాకాలంలో ఉత్పన్నమయ్యే సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, వాటి పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించకుండా, ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారంటూ జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్, బేగంపేట్ సర్కిళ్ల అధికారులపై పలువురు మండిపడుతున్నారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ ఏరియాల్లోని నాలాల్లో, రాంగోపాల్‌పేట్ నల్లగుట్ట, కళాసిగూడ ప్రాంతాల్లోని నాలాల్లో పూడికతీత పనులను నామమాత్రంగా చేపట్టి, చేతులు దులుపుకుంటుండడంతో వర్షాకాలంలో నాలాల పరిసర ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బౌద్ధనగర్, సీతాఫల్‌మండి ఏరియాల్లోని నాలాల్లో మూడు నెలల క్రితం కొంత మేరకు పూడికతీత పనులు చేపట్టి, మిగతా ప్రాంతాల్లో గాలికి వదిలేశారని, దాంతో చెత్తచెదారం విపరీతంగా పేరుకుపోయి, ఈ వర్షాకాలంలో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీరగల్లు శిల్పాలను పరిరక్షించాలి

- డాక్టర్ ఎస్.చెల్లప్ప



త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప, డాక్టర్ కె.విజయబాబు, మణికొండ వేదకుమార్, తదితరులు

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో వీరగల్లు శిల్పాలను పరిరక్షిస్తున్నట్టుగానే రాష్ట్రంలో కూడా వాటిని పరిరక్షించాలని డాక్టర్ ఎస్. చెల్లప్ప అన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ బీవీ.భద్రగిరీష్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ రాసిన త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు (గణపతిదేవుని సంభాషణ-రుద్రమకీల్నుంటె) పుస్తకావిష్కరణ జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయబాబు మాట్లాడుతూ త్రిపురాంతకంలో ఎన్నో శిల్పాలు ఉన్నాయని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు మన చరిత్రను యూరోపియన్లు వారి దృక్పథంతో రాశారని, వారి గొప్పతనం గురించి అందులో పొందుపర్చారని అన్నారు. తెలంగాణ చరిత్రను మరచిపోయే విధంగా అప్పటి పాలకులు చేశారని అన్నారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ వ్యవస్థాపకుడు వేదకుమార్ మాట్లాడుతూ ప్రపంచాన్ని నడిపిస్తున్న దేశాలకన్నా మన దేశానికి ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. ప్రతి గ్రామం ఒక మ్యూజియమేనని అన్నారు. చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి భావి తరాలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వారసత్వ శాఖ మాజీ ఉప సంచాలకుడు సముద్రాల శ్రీరంగాచార్య, కవి, చరిత్రకారుడు తురిమెల్ల శ్రీనివాస్ ప్రసాద్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్లు కట్టా శ్రీనివాస్, మురళీకృష్ణ, ప్రతినిధులు వేణుగోపాల్, ఎం.స్వామి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా పూడికతీత

- వర్షం వచ్చిందంటే చెరువును తలపిస్తున్న జూలమ్మ ఆలయ ప్రాంతం



కాచీబౌలీలో పూడిక తీస్తున్న యంత్రం



వరద నీటిలో ప్రమాదకరంగా ఆడుకుంటున్న పిల్లలు

రాంగోపాల్‌పేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ ప్రాంతంలో నాలాల పూడికతీత కార్యక్రమం తూతూ.. మంత్రంగా సాగింది. డివిజన్‌లోని పలు బస్తీలు వర్షాకాలం వచ్చిందంటే డివిజన్ పరిధిలోని నల్లగుట్టలోని మెక్లోడ్‌గూడ, జూలమ్మ అలయ ప్రాంతం, జే లైన్, కాచీబౌలీ, గోల్డెన్ హోటల్ తదితర ప్రాంతాలు చెరువులను తలపిస్తాయి. రాష్ట్రపతి రోడ్డులోని చిత్రదర్గా వద్ద డివిజన్‌లోకి ప్రవేశించే వర్షపు నీటి నాలా ఆవులమంద, కలాసీగూడ, రంగ్రేజ్ బజార్, మహాత్మా గాంధీ రోడ్డులోని చర్మాస్ మీదుగా నల్లగుట్ట చుట్టాల బస్తీ, మెక్లోడ్‌గూడ, జూలమ్మ దేవాలయ ప్రాంతం, కాచీబౌలీ, మినిస్టర్ రోడ్డులోని వెంగళరావునగర్‌ల మీదుగా సాగుతుంది. ఈనాలా చుట్టుపక్కల ఏర్పడ్డ అధిక శాతం నివాసాల డ్రైనేజి కనెక్షన్లను అక్రమంగా ఈ నాలా కలుపుతున్నారు. గతంలో ఈ నాలాలో వర్షాకాలం కానప్పుడు ఎంతో శుభ్రంగా పిల్లలు ఆడుకునే విధంగా ఉండేది. అలాంటిది ప్రస్తుతం అటుగా వెళ్లాలంటే దుర్వాసన వల్ల ముక్కు మూసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు విషయం తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారు. ప్రస్తుతం ఈ నాలాలో మూడు నుంచి ఆరు అడుగుల మేర మట్టి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. సాధారణంగా జీహెచ్‌ఎంసీ ప్రతి సంవత్సరం వేసవికాలం రాకముందే నాలాలు పూడిక తీయడానికి టెండర్లను పిలుస్తారు. మూడు నుంచి ఆరు అడుగుల మేర మట్టి వ్యర్థాలను తీయవలసినచోట కేవలం ఒక్క అడుగు పూడిక తీతకు మాత్రమే టెండర్లను పిలుస్తున్నారు. దీనివల్ల ప్రతి ఏడు ఈ ప్రాంతాలు వర్షాలు వచ్చాయంటే వర్షపు నీటిలో మునిగిపోతున్నాయి. ఈ సంవత్సరం మూడు నెలల క్రితం చుట్టాల బస్తీలో నామమాత్రంగా రెండు రోజులపాటు పూడిక తీసి మధ్యలో ఉన్న మెక్లోడ్ గూడ, జూలమ్మ దేవాలయ ప్రాంతం, జే లైన్‌లలో వదిలి కాచీబౌలీలో పూడిక తీశారు. అదికూడా నామమాత్రంగా పనులు చేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షానికి మెక్లోడ్‌గూడ, జూలమ్మ ఆలయ ప్రాంతం, జే లైన్ దాదాపు రెండు గంటలు వర్షపు నీట మునిగింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రజలను ఇబ్బందుల నుండి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.